క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధి మైత్రిలేఔట్ ఫీడర్ కింద ఉన్న కరెంటు లైను మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ జేఈ రమేష్ తెలిపారు. నాగులకట్ట, ద్వారకా నగర్, మారుతిహాల్, ఎస్‌బీఐ కాలనీ, మైత్రి లేఔట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

గంగమ్మ ఆలయ చైర్మన్ రాజీనామా



రాజీనామా పత్రాన్ని సమర్పిస్తున్న పీబీ విశ్వనాథరెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లి దేవస్థానం ఆలయ చైర్మన్ పదవికి పీబీ విశ్వనాథరెడ్డి గురువారం రాజీనామా చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి మీకు సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని ఆయన ఆలయ కార్య నిర్వహణ అధికారికి అందజేశారు.

బీజేపీ విజయోత్సవ సంబరాలు



స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూరు : నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా చెన్నూరులో మండల బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామసుబ్బయ్య, రవికుమార్, మండల అధ్యక్షులు గాడి భాస్కర్, సరోజినమ్మ, ముని సుబ్బారెడ్డి, ప్రసాద్, రమణ, శ్రీనివాసరాజు, ప్రతాప్‌రెడ్డి, శివరాంరెడ్డి, శివారెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

11న మండల సమావేశం

పుల్లంపేట : ఈనెల 11వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఏట మహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వినయ్ కుమార్‌కు పురస్కారం



పురస్కారాన్ని అందుకొంటున్న వినయ్‌కుమార్

రాయచోటి టౌన్ : రాయచోటికి చెందిన అబ్దుల్ కలాం యువ కెరటం ట్రస్ట్ డైరెక్టర్ వినయ్ కుమార్‌కు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు యూనివర్శిటీ వారు పురస్కారం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం 11వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన లంబోదర కల్చరల్ అకాడమీ వారి ఆధ్వర్యంలో పురస్కారాలను అందజేశారు. ఈ పురస్కారాన్ని వినయ్ కుమార్ తల్లిదండ్రులు లక్ష్మీనరసమ్మ, వెంకటేశ్వర్లు చేతులుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి అకాడమీ ద్వారా అందించే పురస్కారాన్ని తల్లిదండ్రుల చేతుల మీదుగా అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ఈ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు.

సాయినాథునికి పూజలు



అలంకారంలో సాయినాథుడు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం అర్చకులు సతీష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వాములవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం చేయించారు. అనంతరం భక్తులందరూ అర్చనలు, పూజలు నిర్వహించి స్వాములవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పత్తి పంటకు ఊరట



వేములలో సాగులో ఉన్న పత్తిపంట



చిన్నపల్లె గ్రామంలోకి వచ్చిన వరద నీరు

వేముల : మండల వ్యాప్తంగా కురిసిన పదును వర్షాలతో పత్తిపంటకు ఊరట కలిగింది. ఈ ఏడాది వేసవి పంటగా పత్తి పంటను రైతులు విస్తారంగా సాగు చేసుకున్నారు.

సాగుచేసిన మొదటి నుంచి వర్షాలు లేక పంటలో ఎదుగుదల లేకుండా పోయింది. అంతేకాక అధిక ఉష్ణోగ్రతలతో పంటకు నీటి తడులు అందించినా ప్రయోజనం లేకుండా పోయింది. సాగు చేసిన రెండు నెలలపాటు పదును వర్షాలు లేక పంట గెటి కబారిపోయింది. ప్రస్తుతం పంట పూత, పిందె, కాయలతో ఉంది. ఈ సమయంలో రెండు రోజులుగా కురుస్తున్న పదును వర్షాలతో పత్తి పంటకు బాగా ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు. సకాలంలో వర్షాలు పడడంతో పూత రాలకుండా ఉంటుందని వారు చెబుతున్నారు. మొత్తం మీద పదును వర్షాలతో పత్తిపంటలో దిగుబడులు బాగా వచ్చే అవకాశాలున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో రైతులు హర్షం

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 80.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆర్‌ఐ షేక్షా తెలిపారు. భూమిలో తేమశాతం తగ్గిన తర్వాత ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు రైతులకు ఎంతో ఊరట కలిగిస్తున్నాయి.

చిన్నపల్లెను చుట్టుముట్టిన వర్షం నీరు

కొండాపురం : గండికోట ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా మండలంలోని తిమ్మాపురం చెరువు సమీపంలో ముంపు గ్రామమైన చిన్నపల్లెను బుధవారం రాత్రి కురిసిన వర్షంతో వరదనీరు చుట్టుముట్టింది. గ్రామ సమీపంలోని పొలాల్లో నుంచి వచ్చే వరదనీరు దిగువకు వెళ్లే దారి లేక చిన్నపాటి వర్షం కురిసినా గ్రామంలోకి వస్తోంది. వర్షాకాలంలో ఏటా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10 ఏళ్ల నుంచి ముంపు గ్రామం కింద పరిగణనలోకి తీసుకొని ఇళ్లకు డోర్ నంబర్లు వేసి అవార్డు చేశారు. కానీ వాటికి ఇప్పటి వరకు ముంపు పరిహారం చెల్లించలేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి పరిహారం వచ్చేలా చూడాలని గ్రామస్తులు కోరారు. అలాగే తమకు వేరే ప్రాంతంలో ఇళ్లు ఇవ్వాలని విన్నవించారు.

అంధకారంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్



చీకటిలోనే ఖాతాదారులకు సేవలు అందిస్తున్న ఏపీజీ బ్యాంక్ సిబ్బంది

కమలాపురం : కమలాపురం పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో అంధకారం నెలకొంది. కరెంట్ కోత ఉన్న సమయంలో బ్యాంక్‌లో చిమ్మ చీకటి నెలకొంటోంది. ఒక్క ఫ్యాన్ తిరగదు. కేవలం క్యాషియర్ కౌంటర్‌లో మాత్రమే ఒక చిన్న ఎల్‌ఈడీ బల్బు వెలుగుతోంది. కంప్యూటర్లకు మాత్రమే బ్యాటరీలు అమర్చడంతో సేవలకు ఇబ్బంది లేదు. విద్యుత్ సరఫరా లేని సమయంలో ఇటు సిబ్బంది, అటు ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం వర్షం కారణంగా పట్టణంలో దాదాపు 5–6 గంటల పాటు విద్యుత్ సరఫరా లేదు. ఈ సమయంలో బ్యాంక్‌కు వచ్చిన ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. కోట్ల రుపాయల వ్యాపారం చేసే బ్యాంక్‌లో ఈ పరిస్థితి ఏమిటని ఖాతాదారులు ప్రశ్నిస్తున్నారు. చిన్న ఇంట్లో సైతం విద్యుత్ సరఫరా లేని సమయంలో ఇన్వర్టర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాంటిది వందల మంది ఖాతాదారులు వచ్చే ఇంత పెద్ద బ్యాంక్‌లో ఇన్వర్టర్లు గానీ జనరేటర్ గానీ లేక పోవడం దారుణం అని, ఇప్పటికైనా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఉన్నతాధికారులు స్పందించి బ్యాంక్‌లో ఇన్వర్టర్లు గానీ, జనరేటర్ గానీ అమర్చి ఖాతాదారులు, బ్యాంక్ సిబ్బంది పడుతున్న ఇబ్బందులను తొలగించాలని ఖాతాదారులు రాజశేఖర్, జహీర్, శేషు, మహబూబ్, విజయ్ తదితరులు కోరుతున్నారు.

అగస్త్యేశ్వరునికి భస్మహారతి



భస్మార్చనలో అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా ఉజ్జయిని మహాకాళేశ్వరునికి చేసే విధంగా ఘనంగా భస్మహారతి ఇచ్చారు. వేకువజామున అగస్త్యేశ్వరునికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అగస్త్యేశ్వరుని మూలవిరాట్‌ను వేద పండితులు భస్మంతో అభిషేకించారు. అనంతరం భస్మహారతి ఇచ్చి భక్తిశ్రద్ధలతో పరమేశ్వరున్ని ప్రార్థించారు. ప్రతి నెల అమావాస్య రోజున స్వామివారికి భస్మహారతి పూజాకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు గ్రామంలోని నాలుగు ట్రాక్టర్లలో ఉన్న బ్యాటరీలు, రెండు టేపురికార్డులు చోరీకి గురైనట్లు బాధిత రైతులు గురువారం తెలిపారు. కొత్త వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చునని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో బ్యాటరీ విలువ దాదాపు రూ.4 వేల వరకు ఉండవచ్చునని, మొత్తం రూ.22 వేలు ఉంటుదన్నారు.

ఇంటర్ అడ్మిషన్లపై దృష్టి పెట్టండి



పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులుతో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖ అధికారి కృష్ణయ్య

వేంపల్లె : ఇంటర్ అడ్మిషన్లపై అధ్యాపకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖ అధికారి కృష్ణయ్య కోరారు. గురువారం స్థానిక జిల్లా బాలికల ప్లస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అలాగే ఇంటర్ అడ్మిషన్లపై పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. అడ్మిషన్లు ఎక్కువగా అయ్యే విధంగా ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసులు స్థానిక మదీనాపురంలో ఇంటర్ విద్యార్థుల ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వ కళాశాలలో అన్ని మౌలిక వసతులు, సదుపాయాలు కల్పిస్తారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈయన వెంట ఎంఈఓ స్టాలిన్‌ఐజాక్, పాఠశాల ప్లస్ పీజీటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరాలు



శిక్షణ శిబిరంలో విద్యార్థులు

రామాపురం : గత నెల రోజులుగా మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం వేసవి శిక్షణా శిబిరాలు గురవారంతో ఘనంగా ముగిశాయి. విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చిన దృష్ట్యా సమయం వృథా కాకుండా ఉండేందుకు గ్రంథాలయంలో వేసవి శిబిరాలను ఏర్పాటు చేశామని గ్రంథాలయం అధికారి సూర్య నారాయణరెడ్డి పేర్కొన్నారు. మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్రీడలతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించే అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రతి గ్రంథాలయానికి ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడంతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. గతంలో సెల్‌ఫోన్లు లేనప్పుడు చాలా మంది గ్రంథాలయాలకు వచ్చి చదువుకోవడంతో ఉన్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు



ఖాజీపేట : విత్తన అమ్మకాలను పరిశీలిస్తున్న ఏఓ నాగార్జున

ఖాజీపేట : రైతులు రసాయన ఎరువులు ఇష్టానుసారంగా వాడడం వలన భూ సారం తగ్గుతోందని ఖాజీపేట మండల వ్యవసాయాధికారి నాగార్జున ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో దిగుబడి తగ్గుతోందన్నారు. భూసారాన్ని పెంచేందుకు రైతులు పచ్చిరొట్ట ఎరువులను వాడాలని సూచించారు. అందుకు అనుగుణంగా ఆర్బీకే కేంద్రాల్లో 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పచ్చిరొట్టి విత్తనాలు కావాల్సిన రైతులు వెంటనే ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఖాజీపేట మండలానికి 370 క్వింటాళ్ల జీలుగలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అయితే విత్తనాల కొరత కారణంగా 150 కింటాళ్ల విత్తనాలు మాత్రమే వచ్చాయని, దరఖాస్తు చేసుకున్న రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఖాజీపేట మండలానికి అదనంగా 150 క్వింటాళ్ల మంజూరు చేశారని పేర్కొన్నారు. ఎకరానికి 10 కేజీలు 50 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మండలంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయించాలని సూచించారు. ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖాజీపేట లోని పలు విత్తన దుకాణాలను ఆమె పరిశీలించారు. ఎరువుల ధరలు, మందుల స్టాక్ మొత్తం పట్టిక రూపంలో ఉండాలని సూచించారు.

విత్తన దుకాణాల తనిఖీ



కలసపాడు : దుకాణంలో స్టాకు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏఓ జాకీర్‌షరీఫ్

కలసపాడు : రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన కలసపాడులో పురుగు మందులు, విత్తనాల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని, అనుమతి లేని పురుగు మందులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజు స్టాకు రిజిస్టర్లను అప్‌డేట్ చేస్తుండాలని తెలిపారు. దుకాణాల్లో ధరల పట్టిక ఉంచాలన్నారు. అనంతరం స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి



రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

చింతకొమ్మదిన్నె : రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏపీ రైతు సంఘం కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి తెలిపారు. గురువారం చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె పంచాయితీలో రైతు సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పంటలు పండిస్తున్నా, కష్టానికి తగిన ప్రతిఫలం రాక పోగా అప్పులు, ఆత్మహత్యలు మిగులుతున్నాయన్నారు. పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని, ఎరువులు, పురుగు నివారణ మందులు, వ్యవసాయ పరికరాలు, పెట్రోల్, డీజిల్, రవాణా చార్జీల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. దేశానికి రైతే వెన్నెముక అంటూనే వెన్నెముక విరిగిపోయేలా ప్రభుత్వాలు భారాలు వేస్తున్నాయని తెలిపారు. ఇటువంటి తరుణంలో ఏపీ రైతు సంఘం రైతాంగ సమస్యలపై శక్తి మేరకు నిరంతరం పోరాడుతున్నదని, భూనిర్వాసిత రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు నష్టపోయిన సందర్భాలలో నష్టపరిహారాల కోసం, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల కోసం ధర్నాలు, రాస్తారోకోలు, కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనలు నిర్వహిస్తోందని తెలిపారు. భూసేకరణ పేరుతో రైతుల భూములను తక్కువ నష్టపరిహారం ఇచ్చి బలవంతంగా లాగేసుకుంటున్నారని తెలిపారు. బడ్జెట్లలో వ్యవసాయ రంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కొరత కారణంగా సాగునీటి ప్రాజెక్టులు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి రైతు సంఘాన్ని మరింత బలపరుచుకోవాలని, రైతులందరూ రాజకీయాలకతీతంగా ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, సికేదిన్నే మండల అధ్యక్షులు చిన్న సిద్దయ్యతోపాటు రైతులు పాల్గొన్నారు.

భూమిని సాగు కోసం సిద్ధం చేసుకోండి



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి నాగలక్ష్మి

పులివెందుల రూరల్ : ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో అన్నదాతలు తమ పంట పొలాలను సాగకు సిద్ధం చేసుకోవడంలో నిమగ్నమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో తమ భూములను ఏ పంటకు ఎలా దున్నుకోవాలో వ్యవసాయ అధికారి నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాలుగా ఉండే భూముల్లో నేలకోత ఎక్కువగా ఉంటుందని, భూసారం కూడా తక్కువగా ఉంటుందన్నారు. నీటి నిల్వ శక్తి తగ్గిపోవడం వల్ల బెట్ట పరిస్థితులు త్వరగా ఏర్పడతాయన్నారు. దీనివల్ల దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. వాలు ఎక్కువగా ఉండే నేలల్లో వాలుకు అడ్డంగా సేద్యం చేపట్టాలని, అలాగే పంట సాగు చేసిన మూడు, నాలుగు వారాల తర్వాత పెద్ద నాగలితో ప్రతి 3.5 మీటర్లకు వర్షపు నీరు సంరక్షణ కోసం గొడ్డుచాలు దున్నుకోవాలన్నారు. వాలు తీవ్రత మరీ తీవ్రంగా ఉంటే గట్లను నిర్మించుకోవాలన్నారు.

సున్నపు నేలలో అయితే..

సున్నపు నేలను గుర్తించడానికి 1.4 నిష్పత్తిలో హైడ్రోక్లోరిన్ ఆమ్లం నీరు కలిపి ఒక చుక్క మిశ్రమాన్ని మట్టిపై వేసినప్పుడు బుసబుసలాడే నురుగు వచ్చినట్లయితే దానిలో సున్నం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించవచ్చన్నారు. ఈ నేలలో భాస్వరం, ఎరువు వినియోగం తక్కువగా ఉండడమే కాకుండా సూక్ష్మపదార్థాలైన జింకు, ఇనుము, మాంగనీస్ లోపాలుంటాయన్నారు. ఎకరానికి 4 టన్నులు పశువుల ఎరువులు వేసి పంట నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. ఏదిఏమైనా రైతులు ఖరీఫ్ ముందే భూములను సిద్ధం చేసి ఉంచాలని వివరించారు.

8 నుంచి మంచాలమ్మ తిరునాల



ప్రత్యేక అలంకారంలో మంచాలమ్మ

సుండుపల్లె : మండల పరిధిలోని ముడుంపాడు పంచాయతీ, పింఛా కుడికాలువ గట్టుపైన వెలసిన శ్రీ మంచాలమ్మ తిరునాల ఉత్సవాలు ఈనెల 8వ తేదీ శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి సుబ్బరాయుడు తెలిపారు. రామస్వామి రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని, అలాగే ఉదయం మహాగణపతి పూజ, స్వస్తిహవాచనం, కలశస్థాపన, అమ్మవారికి అభిషేకం, తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు కురవపల్లి నుండి దేవరమొద్దును గుడికి తీసుకువచ్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. 9వ తేదీ ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. 10వ తేదీ ఉదయం సోమవారం అమ్మవారికి అభిషేకం, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే రాత్రి 9 గంటలకు హరికథా కాలక్షేపం, మొక్కుబడులలో భాగంగా భక్తులు ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలుచే మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య చాందినీ బండ్లతో తిరునాల అత్యంత వైభవంగా జరుగుతుందని, కావున భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా శని జయంతి ఉత్సవాలు

కడప కల్చరల్ : శనీశ్వరస్వామి జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక ఆర్కేనగర్‌లోగల శ్రీ సాయి శనీశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, మూలమంత్ర జపం, నవగ్రహారాధన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా శనీశ్వర శాంతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూర్తికి నువ్వులనూనెతో విశేష అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు నువ్వుల నూనెతోపాటు నల్ల నువ్వులను స్వామికి సమర్పించారు. ముదురు ఎరుపురంగు పూలతో పూజించారు. మధ్యాహ్నం భక్తులందరికీ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



కమలాపురం : దుకాణంలో నోటీస్ బోర్డు పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి



వీరపునాయునిపల్లె : నిల్వలపై రికార్డులను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు



పులివెందుల రూరల్ : రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి నాగలక్ష్మి



ఎర్రగుంట్ల : స్టాక్ నిల్వను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి

కమలాపురం : మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందుల దుకాణాదారులు నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలని ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందుల దుకాణాలను ఆమె పరిశీలించారు. రికార్డులు, నిల్వ ఉన్న స్టాక్, నోటీస్ బోర్డులో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందులు మాత్రమే విక్రయించాలన్నారు. డీలర్లు నిబంధనలకు లోబడే విక్రయాలు జరపాలన్నారు. ఎంఆర్‌పీకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి ఉన్న దుకాణాల్లోనే రైతులు కొనుగోలు చేయాలన్నారు. అనంతరం డీలర్స్‌కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జునరెడ్డి, ఎరికలరెడ్డి, సుబ్బారెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

వీరపునాయునిపల్లె : విత్తనాలు, పురుగు నివారణ మందులు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యామ్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న నిలువలకు సంబంధించిన రికార్డులు, ధరల పట్టికలను ఆయన పరిశీలించారు. అనంతరం దుకాణ దారులకు పలు సూచన లిచ్చారు. రైతులకు విక్రయించే ఉత్పత్తుల్లో ఏమైనా పొరపాట్లు జరిగితే దుకాణ యజమానిపై గానీ సంబంధిత కంపెనీలపై కేసులు నమోదు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఎరువు దుకాణాల తనిఖీ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి నాగలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు, మందులు అమ్మేటప్పుడు బిల్లులు ఇవ్వాలన్నారు. దుకాణంలోని విత్తనాల రకాలను స్టాక్ బుక్‌లో పొందుపరచాలన్నారు. స్టాక్ బుక్‌లో బ్యాలెన్స్, గ్రౌండ్ బ్యాలెన్స్ వివరాలను పరిశీలించడం జరిగిందన్నారు.

కాలం చెల్లిన ఉత్పత్తులు ఉంచరాదు

ఎర్రగుంట్ల : విత్తన దుకాణాలలో కాలం చెల్లిన ఉత్పత్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉంచరాదని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఎర్రగుంట్ల పట్టణంలోని దుకాణాలను తనిఖీ చేసి విత్తనాలు, స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు విత్తన నియంత్రణ చట్టం 1983 ప్రకారం, అలాగే విత్తన నియమ నిబంధనలు 1986ను అనుసరించి వ్యాపార లావాదేవీలు కొనసాగించాలని కోరారు. ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్లను అప్‌డేట్ చేసి ఉంచుకోవాలని, అలాగే బిల్లు పుస్తకాలు సక్రమంగా రాసి పెట్టుకోవాలని తెలిపారు. ధరల పట్టిక సక్రమంగా రాసి పెట్టుకోవాలని కోరారు.

పిచ్చికుక్క స్వైరవిహారం



దాడిలో గాయపడిన దినేష్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలో మడకలవారిపల్లె గ్రామంలో గురువారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఈ ఘటనలో ఓ బాలుడితో పాటు పశువులు గాయపడ్డాయి. మడకలవారిపల్లె గ్రామంలో ఇంటి ఎదుట ఆడుకుంటున్న దినేష్‌రెడ్డిపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో చేతిభాగంలో గాయం కావడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అలాగే గ్రామంలోని పశువులు, మేకలపై కూడా దాడి చేయడంతో అవి గాయపడ్డాయి. ఇటీవల కాలంలో గ్రామంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని సచివాలయ సిబ్బందికి సమాచారమిచ్చినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు.